క్లుప్తంగా

సీఎం,ఎమ్మెల్సీ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కోనరావుపేట గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని కోనరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రముఖల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయానికి నీటి ఇబ్బందులు ఉన్న విషయంపై పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వరద కాలువ ద్వారా జగ్గాసాగర్ శివారులోని మాన్పుర్ వాగు గేట్లు ఎత్తి పెద్ద వాగులోకి నీటిని వదిలారు. సాగుకు సకాలంలో నీటిని అందించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగారెడ్డి, ప్రవీణ్, అనిల్, ఆనంద్, అనంతరెడ్డి, సూర్య, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


బుగ్గారంలో మాట్లాడుతున్న ఎస్సై

బుగ్గారం: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఒక్క సీసీ కెమెరా 500 మంది పోలీసులతో సమానమన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్, హెచ్ఎం శ్రీనివాస్ కార్యదర్శి శైలజ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి దారుణం’

కథలాపూర్: యాదాద్రి భువనగిరిలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం దారుణమని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. మండలంలోని భూషణవుపేటలో ఆదివారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నించినందుకు దాడులు చేయడం సరికాదన్నారు. తెలంగాణలో పదేళ్లు శాంతియుతంగా పాలన సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో అరాచకాలు సృష్టించవద్దన్నారు. బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో కల్లెడ శంకర్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

జాతీయ ఐకాన్ అవార్డుకు యువకుడి ఎంపిక


రాము

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన నలువాల రాము జాతీయ ఐకాన్ అవార్డుకు ఎంపికైనట్లు అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధినేత డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదారాబాద్ రవీంద్ర భారతిలో ఈ నెల 20 న రాము అవార్డు అందుకోనున్నారు. గ్రామస్తులు ఆయనను అభినందించారు.

ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

మెట్‌పల్లి: పట్టణంలో ఏఐసీసీ ప్రధాన కార్యర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, నాగరాజ్, నాగేశ్వర్‌రెడ్డి, బాలయ్య, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీర్‌పూర్‌లో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


కోరుట్లలో విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


ఇబ్రహీంపట్నంలో...


సిరికొండలో వివేకానందుడి విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

వివేకానందుడి జీవితం ఆదర్శం

జగిత్యాలటౌన్/కోరుట్ల/కోరుట్ల రూరల్/ధర్మపురి/రాయికల్/కథలాపూర్/మల్యాల/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్: వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం కావాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వివేకానందుడి జయంతి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, మండలాలు, గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి అర్పించారు. కథలాపూర్ మండలం సిరికొండలో స్వామి వివేకానంద విగ్రహాన్ని తెలంగాణ ప్రాంత గ్రామ వికాశ్ సంయోజక్ జిన్న సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో యువజన సంఘాల నాయకులు, పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్, నాయకులు


రాయికల్ మండలం భూపతిపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

సహకార సంఘాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి

పెగడపల్లి: సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలోని నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రైతులకు సమాచారమందిస్తూ రుణాల విషయంలో జాప్యం లేకుండా, రైతులకు అవసరమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, సీఈవో మధుకర్, డైరెక్టర్లు శ్రీనివాస్, మల్లేశం, సిబ్బంది దామెదర్, రాజు, నాయకులు సురేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

మన సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడాలి

జగిత్యాలటౌన్: మన సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం మేరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లావణ్య, మేరు సంఘం అధ్యక్షుడు మాడిశెట్టి మల్లేశం, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారులు మల్లేశం,మ్యాతరి మహేశ్ సహాయ కార్యదర్శి రాపర్తి రమాదేవి పాల్గొన్నారు.


ముగ్గులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్/సారంగాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ జగిత్యాల తహసీల్ చౌరస్తాలో,బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనుచరులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

జగిత్యాలక్రైం: ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై జరిగిన సమీక్షా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌పై దురుసుగా ప్రవర్తించి, తిట్టిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్గీయులు పట్టణ సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో కౌశిక్‌రెడ్డి తీరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

వాలీబాల్ టోర్నీ విజేత సిరిసిల్ల

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీ విజేతగా రాజన్న సిరిసిల్ల జట్టు నిలిచింది. కథలాపూర్ మండలం ఊట్‌పెల్లి జట్టు ద్వితీయ బహుమతి, కరీంనగర్ ఎస్ఆర్ఆర్ జట్టు తృతీయ బహుమతి, కథలాపూర్ పోలీస్ జట్టు నాలుగో బహుమతి అందుకున్నారు. విజేత జట్లకు ఆదివారం నగదుతోపాటు జ్ఞాపిక అందించారు. ఈ టోర్నీలో 50 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జెల స్వామి, మాజీ ఉపసర్పంచ్ ఏజీబీ గణేశ్, ముదాం ప్రవీణ్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి పెంట లింబాద్రి ఆధ్వర్యంలో ఆదివారం యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సున్నం రమేశ్ జట్టు, ద్వితీయ స్థానం బర్కం నిఖిల్ జట్టు దక్కించుకున్నారు. వీరికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు అంకతి రాజన్న, నాయకులు సత్యం, వెంకటాద్రి, యువకులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శశికాంత్‌శర్మ

మెట్‌పల్లిరూరల్: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా సాధన ఎంతో దోహదపడుతుందని స్పైన్ కేర్ వైద్యుడు శశికాంత్ శర్మ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ఆదివారం స్పైన్ సంబంధిత రోగాలకు సంబంధించి ప్రజలకు ఉచితంగా అవగాహన కల్పించారు. పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి సలహాలు,సూచనలు చేశారు. యోగాసనాలతో కొన్నింటికి పరిష్కారం లభిస్తుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

కోరుట్ల: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎంబేరి నాగ భూషనం, పుప్పాల ప్రభాకర్, రాజోజు సదానందాచారి, అక్బర్, ముల్క ప్రసాద్, రియాజ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్


రమేశ్‌ను అభినందిస్తున్న ఉద్యమకారులు

సారంగాపూర్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బీర్‌పూర్ గ్రామానికి చెందిన గర్షకుర్తి రమేశ్ నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం రమేశ్‌కు నియామక పత్రం అందజేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రమేశ్ తెలిపారు.

బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా చంద్రయ్య

తెలంగాణ ఉద్యమకారుల సంఘం బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా జక్కుల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా చల్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడుగా తొడుసం మలుకు, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల కిషన్ నియమితులయ్యారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మల్యాల: మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, సాంస్కతిక సారథి ఆధ్వర్యంలో కళాకారులు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణ కుమార్, పోలీసులు, ప్రజలు, కళాకారులు పాల్గొన్నారు.



వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

కోరుట్ల రూరల్: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

మల్లన్న దేవాలయంలో పట్నాలు



రాయికల్: పట్టణంలోని మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్లన్న స్వామి పట్నాలు, కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.

కోదండరామాలయంలో పరమపదోత్సవం



కోదండరామాలయంలో వేసిన ముగ్గులు

జగిత్యాలటౌన్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో పరమపదోత్సవం పేరిట వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. మాతలు రెండు గంటలపాటు శ్రమించి ఈ ముగ్గులు వేసినట్లు ఆలయ పూజారి రామానుజ ప్రణయ్‌శర్మ తెలిపారు.

కొండగట్టులో యువకుడి ఆత్మహత్యాయత్నం

కొండగట్టు: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం తెల్లవారుజామున యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే మల్యాలకు చెందిన మహిపాల్ అనే యువకుడు గత కొద్దిరోజుల నుండి మానసికంగా అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు మహిపాల్ ను కొండగట్టులో బేతాళుని కొండపైన ఉంచారు. కాగా ఆదివారం తన ఆరోగ్యం విషయంలో తండ్రి మందలించాడని ఆదివారం తెల్లవారుజామున భేతాళ స్వామి గుడి వెనక వైపున గుట్ట కింద దూకాడు.సమాచారం తెలుసుకుని స్పందించిన ఏఎస్సై చిలుక శ్రీనివాస్ మహిపాల్‌ను తొటి సిబ్బందితో రక్షించే ప్రయత్నం చేశారు. శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలు కావడంతో కరీంనగర్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల రూరల్: పట్టణంలోని మహాత్మా విద్యాలయంలో 2011–12 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పట్టణ శివారులోని ఓ మామిడి తోటలో సమ్మేళనం నిర్వహించుకుని చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నంత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం రాయికల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాలలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

జగిత్యాలటౌన్: జగిత్యాలలో గద్దర్ విగ్రహ ఏర్పాటు చేస్తామని గద్దర్ గలం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జెల స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో గద్దర్ గలం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గజ్జెల స్వామిని ఫౌండేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే గద్దర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందిగా కోరారు. ఫౌండేషన్ జిల్లా కన్వీనర్‌గా ఈదుల లక్ష్మణ్‌కుమార్, కోకన్వీనర్‌గా అంతడుపుల అంజయ్యను నియమించారు. కార్యక్రమంలో కళాకారులు, ఉద్యమకారులు భూక్య గంగాధర్‌నాయక్, ఎస్వీ మల్లిక్‌తేజ, జవ్వాజి శంకర్, పంచరి ప్రవీణ్, మారంపెల్లి లక్ష్మణ్, బాలె శంకర్, మహిళా కన్వీనర్ వనిత తదితరులు పాల్గొన్నారు.


గజ్జెల స్వామిని సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పోచంపేటలో వైద్యశిబిరం


నివాళి అర్పిస్తున్న వైద్యులు, గ్రామస్తులు

సారంగాపూర్: మండలంలోని పోచంపేటలో ఆదివారం జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం ప్రారంభానికి ముందు వైద్యులు, గ్రామస్తులతో కలిసి స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో 172 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కోటగిరి సుధీర్‌కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రావణ్‌కుమార్, డాక్టర్ ఇనుగుర్తి రాజశేఖర్,డాక్టర్ ఆర్ ప్రశాంత్, రఘురాం, నాయకులు పల్లికొండ రమేష్, రెంటం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: మనోజ్ - 8074811004
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com